# మూడునాళ్ల ముచ్చట

రచన:
శ్రీ తురగా సుందరం

ఇది ఆరునెలల క్రిందట జరిగిన సంగతి. నాకు వంట్లో కొంచెం సుస్తీగా ఉంటూ వుండేది. మావారు మావీధిలో ఒక డాక్టరుంటే ఆయనచేత కొన్ని పొట్లాలిప్పించేరు. శరీరాన్ని అట్టే కష్టపెట్టకూడదు, నాలుగురోజులపాటు ఎవరన్నా వంటలక్క పెట్టుకోమని సలహా యిచ్చేడు వైద్యుడు. అవి పెళ్లిళ్ల రోజులు. ఎవరో చెప్పినట్లుగా అన్నిటితోపాటు వాళ్ళకి కూడా రేషనింగు, రేషనింగుతోపాటు నల్ల మార్కెటు వచ్చేయి. అతికష్టంమీద అప్పాయమ్మనే పూర్వ సువాసినిని రోజుకు రెండురూపాయల చొప్పున కుదిర్చేరు మా ఆయన. ఏదో కొన్నాళ్ళపాటు అలసట లేకుండా మందుపుచ్చుకుంటూ ఉంటే ఆరోగ్యంగా ఉంటుందికదా అని అనుకున్నాను.

మొదటిరోజు చీకటితోటే వచ్చింది వంటావిడ. కొత్తగా వచ్చేను గనుక యింట్లో ఏవేవి ఎక్కడున్నాయో చూపిస్తే తనపని తను చేసుకుంటానంది. మధ్యగదిలో వున్న బియ్యం, వంటింటి పక్కన ఉన్న పప్పులు, వంటింట్లో ఉన్న మిగిలిన వస్తువులు, గిన్నెలు చూపించి ఏం ఏం గిన్నెలు దేనికి ఉపయోగిస్తామో, తరువాత వంటేమి చెయ్యాలో అంతా చెప్పేటప్పటికి ఎనిమిదిగంటలైంది. ఇంక నా పని ఏమీ లేదు కదా అని ఆయాసంగా ఉంటే కాస్త నడుం వాల్చేను. ఇంతట్లోకే మళ్లా ఆవిడ వచ్చి తను పెద్దదాన్నని చత్వారం ఉండడంవల్ల దృష్టి సరిగా ఆనదు కనుక నేను బియ్యంలో రాళ్లు తీసిపెడితే తనపని తను చేసుకుంటానంది. సరేకదా అని ఆ కాస్త పని నేనేచేసేను. ఆరోజున పాలవాడు ఆలస్యంగా అప్పటికి వచ్చేడు. నేను అప్పాయమ్మని పిలిస్తే పలకలేదు. దొడ్లో నూతిదగ్గర స్నానం చేస్తోంది కాబోలని అనుకుని నేనే పాలని తీసుకుని కుంపటంటించి దానిమీద పెట్టి కాస్సేపు నడుం వాల్చేను. ఇంకా ఆవిడ ఊడిపడలేదు. ఆ పాలు కాస్తా పొంగిపోతాయేమో అని అక్కడే కూర్చుని పాలుకాగడం అయ్యాక దింపి అలమారు గూట్లో పెట్టి మళ్ళీ ఆయాసంగా ఉంటే గోడకి జేర్లా కూర్చున్నాను. తొమ్మిదిగంటలయ్యాక వంటింట్లో ప్రవేశించింది. ''అదేమిటమ్మా? అలాగ చేస్తే ఎలాగా? మావారు పదిగంటలకల్లా ఆఫీసుకు వెళ్లాలి. ఇప్పటికి కూడా వంట మొదలెట్టకపోతే ఎలా''గంటే, ''పెద్దదాన్ని కాదుటమ్మా, కాస్త మడీ, ఆచారం ఉన్నాయి. అందుకని కాస్త ఆలస్యం అవుతే అవుతుంది. ఈ పూటకి ఎలాగోలాగ సర్దుకుంటే తరువాత అన్నీ గంటల ప్రకారం జరుగుతాయి'' అంది. ''సరే, యీ పూటకి గడుపుకోవాలి, మీరు హోటల్లో భోజనంచేసి ఆఫీసుకు వెళ్ల''మని మావారితో చెప్పేను. ఆయన దానికి ఒప్పుకుని వెళ్లిపోయారు.

మళ్లీ కాస్త కూచుందామని అనుకుంటే వంటావిడ వచ్చి ''మీకు ఎంతెంత బియ్యం కావాలో నాకు తెలియదు. మీరు కొంచెం యిలావచ్చి కొలిచి గిన్నెలో పోస్తే నేను తక్కిన పనులు చేసుకుంటా''నంది. దాని తరువాత కొంచెం పులుసులోకి చింతపండు, కాస్త కూరలోకి ఉప్పు వగైరాలన్నీ చూపించమంటూ మూడువంతుల ముప్పాతిక వంట నాచేతే చేయించింది. 'ఇదేమిటిరా ఖర్మం, సుఖపడదామని వంటలక్కని పెట్టుకుంటే నాకు పని తప్పలేదు సరికదా ఆ మనిషికి అనవసరంగా డబ్బు యిచ్చుకోవడంకూడాను'' అని అనిపించింది కాని ఏదో మొదటిరోజుకదా తరువాత అన్నీ సరిగ్గానే జరిగిపోతాయని సమాధానపరచుకున్నాను. మొత్తంమీద ఒంటిగంటకి వంటైంది. మడీ కనుక అవి ముట్టుకోకూడదు అని పీటలు, విస్తళ్లు వేసుకోవడం, మజ్జిగదగ్గర పెట్టుకోవడం వగైరాలతో భోజనం అయింది.

అసలే ఒంట్లో బాగాలేదు. దానిపైన వంటపని, దానిపైన ఆవిడతో వాగడం యివన్నీ కలిపి నాకు చాలా ఆయాసం కలిగిస్తే భోజనంఅవగానే మాట్లాడకుండా పడుకున్నాను. ఆ పడక పడక సాయంత్రం నాలుగు గంటలకి మెలకువవచ్చింది. 'అయ్యో!

మావారికి టీ వేళైందే' అని ఖంగారుపడి లోపలికెళ్ళి చూద్దునుకదా ఎవ్వరూ లేరు. ఎంగిళ్లు, విస్తళ్ళు అలాగే ఉన్నాయి, తలుపులు వేసేఉన్నాయి. అన్నంగిన్నె, పులుసు గాచిప్ప, కూరపళ్లెం లేవు. కొంచెం ఆలోచించగానే అప్పాయమ్మ వాటిల్ని యింటికి తీసుకువెళ్లి ఉంటుందని తోచింది. అప్పటికి ఊరుకుని 'టీ' నీళ్ళుపెట్టి కూర్చున్నాక మావారు వస్తే టీ చేసి యిచ్చాను. సాయంత్ర ఐదుగంటలయ్యాక వచ్చింది వంటావిడ. ఖాళీగిన్నెలు, పళ్లెం చేత్తోపట్టుకుని "ఏవమ్మా! విస్తళ్ళుఅయినా తీయలేదు, టీ వేళకికూడా రాలే" దంటే, "నా మేనమామకొడుకు బావమరది ఒక కుర్రాడున్నాడు. పాపం వాడికి వండిపెట్టేదీక్షత లేకపోతే మడిబట్టతో కాస్త అన్నం తీసుకెళ్ళి, వాడి భోజనం అయ్యాక కాస్త నడుంవాల్చి వచ్చేటప్పటికి ఆలస్యం అయింది కాబోలు. ఏదో యిది మొదటిరోజులెండి. కొంచెం సర్దుకోవాలి" అంది. ఇళ్ళన్నీకడిగి వంట మొదలు పెట్టేటప్పటికి ఏడుగంటలైంది. తరువాత సరిగా దృష్టిఆనదని ఒక్క అన్నమే వండింది. ఆపూట రాత్రి తొమ్మిదిగంటలకి ఊరుగాయతో భోజనం.

ఇక రెండవరోజు పొద్దున్న ఎనిమిదిగంటలయ్యాక వచ్చింది ఆవిడ. ఆరోజు పాలవాడు పెంద్రాళే వస్తే కాఫీ మళ్ళీ నాచేతులతోనే తయారైంది. "ఏవమ్మా! యింత ఆలస్యంచేస్తే ఎలా" గంటే వంట్లో బాగుండకపోతే కొంచెం ఆముదంపట్టి సముదాయించి వచ్చేనంది. ఆవిడకే వంట వదిలిపెడితే మా ఆయనకి మళ్ళీ హోటలుభోజనమే ప్రాప్తి అవుతుందేమో అనుకుని నేనే చెయ్యిచేసుకుని చాలా మట్టుకు కానిస్తే పావు తక్కువ పదిగంటలకి వంటైంది. మావారు గబగబా నాలుగుమెతుకులు నోట్లోవేసుకుని ఆఫీసుకు వెళ్లిపోయారు. మా భోజనాలు అయ్యాక యథాప్రకారం ఆవిడ గిన్నెలు చేత్తోపట్టుకుని బయటకు నడచి, మళ్ళీ సాయంత్రం ఐదుగంటలకి ప్రత్యక్షం అయింది. మళ్ళీ ఎందుకింత ఆలస్యం అయిందంటే, వాళ్ళ మేనమామ కొడుకు బావమరదియొక్క పినతండ్రి, తెలువిడిచిన మేనమామ వచ్చారని, బాగుండదని వాళ్ళతో పిచ్చాపాటీ కాస్త మాట్లాడుతోండగా ఆలస్యంఅయింది కాబోలు అంది. దానితరువాత మాటవరుసకి మా మేనత్త,పిల్లలు రేపు వస్తారు, ఒక వారం రోజులపాటు ఉంటారని అన్నాను. ఆవిడ ఏమీ మాట్లాడలేదు. మామూలు ఊరుగాయలతో భోజనం అయ్యాక వెళ్ళిపోయింది!

మూడోరోజు పొద్దున్న ఏడైంది, తొమ్మిదైంది. ఎప్పటికీ వంటావిడ దర్శనంలేదు. పదిగంటల బండికి మేనత్త, పిల్లలుకూడా వచ్చేరు. ఏదో అత్తిసరు, పచ్చిపులుసు చేసుకుని తిన్నాం. పోనీ ఏమయిందా అని వంటావిడ యింటికి కబురుపెట్టితే తను మాకే గాని, మా బంధువులకి వంట చెయ్యడానికి ఒప్పుకోలేదని, తనకు రావలసిన డబ్బు తక్షణం పంపవలసిందనీ జవాబు వచ్చింది.

మళ్ళీ అప్పటినుంచి వంటమనిషి పేరెత్తితే ఒట్టు.


## మహాభల్లాతకి లేహ్యము

సమస్త కుష్టములను సమూలముగా నాశనమొనరించు దివ్యౌషధము.

పొడలు, కారకములు, మేహరోగములు, గ్రంధులు మొదలగునవి 10 మోతాదులలో నివారణమగును.

40 దినములకు సరిపోవు మందు రూ. 8-0-0
అనుపాన కషాయము రూ. 4-0-0

## మోచాకంద రసాయనము

మలబద్ధకము, ఆసనమునందు దురద, బైటకు వెళ్లినపుడు రక్తముపడుట, మొలకలు మొదలగు సర్వవిధముల మూలములను కుదుర్చును.

20 తు॥ డబ్బా రూ. 3-0-0.

ఆర్య వైద్య మందిరం,
(డా॥ డి. నరసింహాచార్యులు)
ఈగవారిపాలెం (P. O.) చెంగల్పట్టుజిల్లా.